"అడిగితే అమ్మ యింకా ఏడుస్తుంది పాపం......కదా."

ఆయన అడుగులు తడబడుతున్నాయి తొలిసారి.

సందు మలుపు తిరుగుతూంటే "నీ చెయ్యి వణుకుతోంది తాతయ్యా" అన్నాడు నాని.

"మీ అమ్మకు చెప్పకు"

"చెయ్యి వణుకుతుందనా."

"కాదు. నువ్వు నాకు చెప్పావని."

అలాగేనని తలూపిన నానీ టక్కున తాతయ్య చెయ్యి పట్టుకులాగాడు ఓ ఇంటి వేపు చూపిస్తూ.

చాలా యాదృచ్ఛికంగా జరిగిపోయిన సంఘటనది....

భార్యకి మాత్రమే పరిమితం కావల్సిన శృంగారం ఒక బూతుగా రసాభాసం చెందడాన్ని కావ్యాల్లో సైతం నిరసించే మహా పండితుడయిన విశ్వేశ్వరశాస్త్రి .......

దశాబ్దాల తరబడి శ్రోత్రియభావాల ప్రవంతిలోనే బ్రతుకును నెట్టుకొస్తూ తన కొడుకు తనకి నిజమైన వారసుడే అని కొన్ని నిమిషాల క్రితమే గర్వపడిన ఆ తపస్వి మౌనం అక్కడ భంగమైపోయింది.

వీధి లాంతరు వెలుగులో చాలా స్పష్టంగా చూశాడు ఆయన.

అక్కడ ఆ ఇంటి వసారాలో కూర్చున్న కొడుకు చంద్రం ఓయువతిని దగ్గరికి తీసుకొని ఆయన చూస్తుండగానే గదిలోకి లాక్కుపోయి గడియపెట్టాడు.

మొన్నటి తరాన్ని నిన్నటి తరం భ్రష్టు పట్టిస్తే ఇప్పుడేం చేశావు తాతయ్యా అన్నట్టు రేపటి తరానికి ప్రతినిధిలా నానీ రెప్పలార్చకుండా చూస్తున్నాడాయన్నే-----

నిలుచున్న పాటున కందాన్ని అందంగా చెప్పగల ఓ కవి ఛందస్సు మరచిపోయినట్టు భారంగా అడుగులేస్తున్నాడు విశ్వేశ్వరశాస్త్రి .

ఇంట్లో అడుగు పెట్టేసరికి భార్య కనిపించలేదు కాని ఆ ఇంటి సేవలకే తన బ్రతుకు పరిమితమైనట్టు పావని మామగార్ని చూడగానే ఇత్తడి చెంబుతో నీళ్ళందించింది.

అందిస్తూ నానీని చూసింది.

నానీ ఎప్పటిలా కావలించుకొని కబుర్లు చెప్పకుండా తాతని చూస్తున్నాడు.......

ఆ ఇంటితో తొమ్మిదేళ్ళ బంధం గల పావనికి అర్ధమైపోయింది అనుకోనిదేదో జరిగిందని....

ఋష్యత్వం సిద్ధించిన బ్రహ్మజ్ఞానిలా నిరంతరం దరహాసాన్ని చిందించే మామగారిని ఏం జరిగిందీ అడిగేదేకాని ఆయన ముందు శ్రోతగానే నిలబడే అలవాటు మాత్రమే గల ఆమె సాహసించలేకపోయింది.

"అత్తయెక్కడ....." అనడిగిన శాస్త్రి....

పూజ గదిలో నుంచి బయటకొస్తున్న కాంతమ్మని చూస్తూ "నువ్వలా వెళ్ళమ్మా"

అన్నాడు కోడలితో.

నానీని తీసుకుని పక్కగదిలోకి నడిచిన పావని బిక్కమొహం వేసుకు నిలబడ్డ కొడుకుని అక్కున చేర్చుకుందిగాని ఏం జరిగిందీ అడగలేదు.

ఆమెకి తెలుసు కదిపితే నది ఒడ్డున రేగిచెట్లు మొదలుకొని ఇంట్లోని రాగి చెంబుదాకా గడగడా గంట సేపు ఏకరువు పెడతాడు.

"కొడుకక్కడ కులుకుతుంటే నువ్విక్కడ పూజలుచేస్తున్నావా"

అస్పష్టంగానయినా మామగారి కంఠం కంచులా వినిపించేసరికి సగం బోధపడిపోయింది పావనికి.

నానీకేసి చూసింది.

"చూడూ-మనం ఓ పని చేద్దామా" అంది తన కళ్ళలో నీటిని కొడుక్కి కనిపించకుండా జాగ్రత్తపడుతూ.

"ఏంటీ?"

అక్కడ జరిగే చర్చకాని ఆ చర్చ సారాంశం గాని కొడుక్కి మరింత వివరంగా తెలియడం ఇష్టంలేనట్లు పెరట్లోకి లాక్కుపోయింది.

అక్కడున్న మల్లెచెట్టును చూపిస్తూ "బోలెడన్ని మల్లె మొగ్గలు వున్నాయి కదూ" అడిగింది.

తలూపాడు చొక్కాతో కళ్ళు తుడుచుకుంటూ.

"మనింట్లో మూడు దేవుడి ఫోటోలున్నాయిగా"

"అవును."

"మూడింటికి మూడు మాలలు కట్టాలి."

"ఓసింతేనా?"అన్నాడు.

"అందుకని నువ్వు సరిగ్గా నూటయాభయ్ మొగ్గల్ని తుంచి నా వడిలో వేయాలి".

"వాట్ని మూడు భాగాలు చేస్తావా?"

"మరేం.... నీకు మూడో ఎక్కం వచ్చుగా" ఆప్యాయంగా తల నిమిరి "పైగా నువ్వు లెక్కల్లో ఫస్టు కూడాను" అంది.

తన దృష్టి మరల్చటానికి అమ్మ ఈ పని అప్పచెప్పిందని తెలీని నానీ "సరే.... ఒడి పట్టయితే" అంటూ మొగ్గల్ని తుంచటం ప్రారంభించాడు.

ఆమె ఒడి పట్టింది గాని అన్యమనస్కంగా లోపలి సంభాషణే వింటోంది.

"అదెవర్తె...."

"హెల్త్ అసిస్టెంట్‌గా చేరి ఆరు నెలలయింది. అబ్బాయి వి.డి.ఓ. కాబట్టి బాగా సన్నిహితమైందట."

"ఓసి భ్రష్టురాలా..... అంటే ఇవన్నీ నీకు ముందే తెలుసన్నమాట"

ఉద్రేకాన్ని అణిచిపెట్టుకుంటూ ఆయన నిలదీస్తున్నా స్పష్టంగానే వినిపిస్తుందామెకి.

"ఈ దేభ్యం మొహం దానితో ఓ ముద్దా ముచ్చటా.......పైగా అది బాగా ఆస్తిపాస్తులున్నది కూడాను."

"రా......క్ష........సీ....."

పావని వణికిపోతోంది. ఏదైతే ఇన్నాళ్ళూ మామగారికి తెలియకూడదని కోటి దేవుళ్ళకి మొక్కుకుందో అది తెలిసిపోయినందుకు ఉద్వేగపడుతూ ఆ గొడవ క్రమంగా ఎక్కడికి దారి తీస్తుందో అన్న సందిగ్ధతతో నలిగిపోతోంది.

"వాడిమీద ఆధారపడి బ్రతుకుతున్న వాళ్ళం---పౌరుషం దేనికండి" ఖండితంగా చెప్పింది కాంతమ్మ.

"అంతకంటే చావడం నయంకదే!" మూడు దశాబ్దాల తమ దాంపత్యంలో ఆమెను తన కనుగుణంగా మలుచుకోలేనందుకు బాధో, లేక కాలానుగుణంగా ఆమెలో వచ్చిన మార్పుకి జుగుప్సో ఆయన కంఠం వణికిపోతూంది.

ఓ క్షణం నానీని చూసింది, నానీ సైతం చెవొగ్గి వింటున్నాడని గ్రహించి "డెబ్భయ్ ఆరని మళ్ళీ నలభయ్ ఏడంటావేంట్రా" అంది మందలింపుగా.

"ఆ.....నువ్వు సరిగా ఒడి పట్టడం లేదుగానీ" దొరికిపోయినట్టుగా బుంగమూతి పెట్టాడు.

అప్పుడు చూసిందామె.

తను తొట్రుపాటులో రెండు చేతుల్తో చీర చెరుగు ఒక అంచున పట్టుకోవడంతో అప్పటికే సగానికి పైగా మెగ్గలు నేలపై పడిపోయాయి.

నొచ్చుకుంటూ మెగ్గల్ని ఆదరాబాదరాగా ఒడిలోకి ఎత్తుతుంటే మరో కంఠం వినిపించింది లోపల

"నా ఇష్టం నాన్న గారూ, మీరెవరు అడగడానికి?"

తండ్రి కంఠంలోని ఆ తీవ్రతకి పావనికన్నా ఎక్కువ ఉలిక్కి పడ్డాడు నానీ.

అయినా అమ్మ కోపగించుకుంటుందేమో అని వణికిపోతూ లెక్క పెడుతున్నాడు.

లోపల వాగ్వివాదం తారాస్థాయికి చేరుకుంటూంది.

"ర్రేయ్!"

ఏదో చప్పుడు.

ఇక నిభాయించుకోలేని పావని ఎంత వేగంగా లోపలికి పరుగెత్తిందంటే రెప్పపాటులో విశ్వేశ్వరశాస్త్రి చెంపని తాకాల్సిన భర్త చేతిని భయంగానే పట్టుకుంది.

విసురుగా పక్కకి నెట్టేసరికి గోడకి తల కొట్టుకున్న పావని నిస్త్రాణగా జారగిలబడిపోయింది.

దశాబ్దాల తన సామ్రాజ్యం విచ్ఛిన్నం కాగా రాజ్యబహిష్కరణ చెందిన చక్రవర్తిలా శిథిలమై, ఆశీస్సుల్ని అందించే చేయి, నేలని పునీతం చేసే కాలు పక్షవాతంతో ఓడించగా

కుప్పలా కూలిపోయాడు విశ్వేశ్వరశాస్త్రి.

అసలు కథ తెలియని వూరిలోని ప్రముఖులతో పాటు సామాన్యులూ విశ్వేశ్వరశాస్త్రి శాశ్వతంగా మంచం పట్టాడని తెలిసి వారం రోజులపాటు చూసిపోతూనే వున్నారు..... కూతురు సరళతోపాటు అల్లుడూ వచ్చి వెళ్ళారు.

అందరిలోనూ ఆయన గురించి అతిగా దిగులు పడింది నానీ........ బడికి వెళ్ళనని మారాం చేశాడు.

అపరాత్రి నిద్రలో లేచి కలవరించేవాడు.

తను చెప్పడంతోనే ఇదంతా జరిగిందేమో అన్న బాధ- ఆ చిన్న మనసులో.

"నే తప్పు చేశాను కదమ్మా" అడిగాడో రోజున తల్లిని.

"జరగాల్సిందిల్లా జరిగిపోయింది" కొడుకుని గుండెలకు హత్తుకుంది" నీతప్పేముంది నాన్నా?"

"నీకేం తెలీదు. అసలా రోజు చూపించింది నేనే."

నిర్లిప్తంగా ఓ క్షణం చూసిన పావని "నీ గురించి తాతయ్య ఎంత బాధపడుతున్నారో తెలుసా?" అంది మాట మారుస్తూ.

"దేనికి?"

"నువ్వు స్కూలుకెళ్ళడం లేదని."

"నేను వెళ్ళనంతే."

"అంటే తాతయ్య బాధపడినా ఫర్వాలేదా?"

"అహ" తల అడ్డంగా వూపాడు "వెళతాను, బాగా చదువు కుంటాను."

"డాక్టరువైపోవాలి"

"ఎందుకు?"

"తాతయ్య జబ్బు నయం చేయాలిగా."

"అది ఇంక నయం కాదటగా?"

"ఎవరన్నారు?"

" మొన్న డాక్టరంకుల్ చెపుతుంటే విన్నాగా " క్షణం ఆగి " నేను పోలీసునైపోతాను " అన్నాడు.

"దేనికి?"

"దాన్ని జైల్లో పెట్టేస్తాను."

'దాన్ని ' అంటూ ఎవరినుద్దేశించి అన్నాడో తెలిసిన పావని అస్థిమితంగా కదిలింది. "తప్పు.... అలా అనకూడదు."

"ఎందుకు తప్పు.... అదేగా నాన్నని పాడు చేసింది."

"ఎవర్నీ ఎవరూ పాడుచేయలేరు నాన్నా.... కొన్ని జరగాల్సినవి అలా జరిగిపోతుంటాయి."

"ఏం తెలీదు నీకు" అమ్మ మాటలు అర్థం కానట్లు కోపంగా తాతయ్య గదిలోకి నడిచాడు.

నిస్సత్తువగా తలని తిప్పి "ఏరా అల్లరి భడవా.... బడికెళ్ళడంలేదట కదూ" అడిగాడు.

తలొంచుకొన్న నానీ "ఈవేళ నుంచి వెళతాను తాతయ్యా! మరి నేనూ బాధపడుతున్నానుగా" అన్నాడు.

"దేనికీ?"

" మనం ఏటి ఒడ్డు కెళ్ళడం లేదుగా?"

"అమ్మకూడా ఏరులాంటిదే అంటే ఒప్పుకున్నావు కదమ్మా!
అప్పుడు అమ్మ ఒడిలో కూర్చుంటే ఏటి ఒడ్డున ఉన్నట్టేగా."

తల పంకించాడు చాలా అర్థమైపోయినట్టు.

మరి తాటిపళ్ళో అనబోయి తాటిపళ్ళకన్నా తాత తనకు ముఖ్యమనుకుని ఆగిపోయాడు.

"రేయ్ నానీ" గంభీరంగా అన్నాడాయన "నేను మంచం పట్టానని నువ్వు వేషాలు వేస్తే వూరుకోను వెధవకానా" అని.... "చెమ్డా లూడగొడతా. రోజూ ఉదయం సాయంకాలాలు నా గదిలోనే కూర్చోవాలి.... అర్థమైందా?".

తాతయ్య అంత ఉత్సాహంగా మాట్లాడుతుంటే అన్ని రోజుల బాధనీ మరిచిపోయిన నానీ అమాంతం తాతని చుట్టేసి "అలాగే తాతయ్యా" అన్నాడు.

"ఏదీ ఓ నర్సరీ రైమ్ చెప్పు.... బాగా నటిస్తూ పాడాలి"

"జాక్ అండ్ జిల్

వెంటప్ ఏ హిల్

టు ఫెచ్ ఏ పైలాఫ్ వాటర్" చేతులు తిప్పుతూ....

తాతయ్యని సంతృప్తి పరచాలని ప్రయత్నిస్తూ ఆ పాటలోని భావమేదో తాతయ్యకి సంబంధించినట్టనిపించి ఆగిపోయాడు .

"మరిచిపోయావట్రా భడవా.... చూడూ.... ఆ తక్కింది నేను చెప్పేస్తా.... జాక్ ఫెల్‌డౌన్ అండ్ బ్రోక్ హిజ్ క్రేన్ అండ్ జిల్ కేమ్ డౌన్ టంబ్లింగ్ ఆఫ్టర్ హిమ్."

ఈసారి చివరి వాక్యం చెబుతూంటే విశ్వేశ్వరశాస్త్రి కంఠం వణికింది.

"రామ్మా.... బడికి టైమైంది" తల్లి పిలిచింది.

సరిగ్గా అదే సమయంలో....

విశ్వేశ్వరశాస్త్రిపై విపరీతమయిన గౌరవభక్తులు గల కామందు శంకరయ్య హెల్త్ అసిస్టెంట్ కామేశ్వరి ఇంటికి వెళ్ళాడు.

అసలు విషయం సేకరించడానికి ఆయనకి అన్ని రోజులు పట్టింది.

చంద్రమనుకుని తలుపు తెరిచిన కామేశ్వరి ఎదురుగా వున్న పెద్ద మనిషిని చూసి కంగారుపడుతూనే "రండి" అంది.

"రండా ఓసి....! నేను కూర్చోవడానికి రాలేదే! నీ మైల గాలితో ఓ మహాత్ముడ్ని
మంచం పట్టించావని మొహంమీద ఉమ్మేసి పోదామని వచ్చాను. థూ నీ యవ్వ"
అంటూ నిజంగానే ఉమ్మేసి వెళ్ళిపోయాడు.

పట్టించుకోలేదు కామేశ్వరి.

మామూలుగా తుడిచేసుకుంది.